కథ

# చిట్టితల్లి

హవ్వ... హవ్వ...

ఎంత లోకువైె యానందరికీ...

ప్రతివాళ్లూ వెక్కిరించ మే. అడ్డమైన వెధవలూ విమర్శించడమే.

ముక్కుమీదికి కళ్లజోడెక్కి కూర నే వయసొచ్చింది. వీపు మీద మనవలెక్కి ఆడుకునే తరుణ రాబోతోంది.

ఇంకా... ఇంకా ఇది భరించడం నా వ కాని పని. ఈ బాధను నేనింక మోయలేను.

ఈ వేదనతో నా కడుపుడికిపోతోంది.

చిట్టి తల్లట! చిట్టి తల్లి. ఎంచి ఎంచి గొప్ప పెట్టారు.

మొన్నటికి మొన్న ఆ పెద్దాసుపత్రిలో నర్సు తగా ఎద్దేవా చేసింది.

''చిట్టితల్లంటే మీరా. ఇంకా చిన్నపిల్లనుక న్నాను లెండి.'' అంటూ పళ్లన్నీ కనిపించేలా ఇకిలించింది.

చుట్టుప్రక్కల వాళ్లందరూ కిసుక్కున నవ్వా

నాకెంత చిన్నతనంగా అనిపించిందో చెప్పలేను.

నిన్నంటే నిన్న, జనాభా లెక్కలకి వచ్చిన టీచరమ్మా–

''నేనడిగింది మీ ముద్దుపేరు కాదండీ. అసలు పేరు'' అని వెటకారంగా అడిగింది.

నే చెప్పింది నా అసలు పేరే అని చెప్పగానే దోలా చూసింది.

అందులో భావం అర్థమైనా గుండె మండి క్కసారి.

అయితే. వీటన్నింటికన్నా, నన్నెక్కువ వ్యాక పరిచింది రోజు ఉదయం జరిగిన సంఘటనే.

ఈరోజు ఉదయం మా అమ్మాయి మంగళ ఫ్రెండ్సొచ్చారు. వాళ్లందరికీ కాఫీలు కలిపి అందించాను.

ఇంతలో మా అత్తగారు కొంప మునిగిపో నట్లక్కడికి వచ్చారు. వచ్చినావిడ ఊరుకున్నారా!

''ఏమే చిట్టితల్లీ! ఈ అమ్మాయిలకి మొ చేసిన చేగోడీలు పెట్టవే. అమ్మాయిలూ! ఓ నాలుగు నమిలి వెళ్లండర్రా'' అన్నా గొప్పగా.

''ఏయ్ మంగళా! మీ అమ్మగారికి 'చిట్టిత అన్నది ముద్దుపేరా!'' అడిగారు వాళ్లు నవ్వుతూ.

''అబ్బే! ముద్దుపేరు కాదర్రా, అసలు పే...'' అన్నారు మా అత్తగారు వివరిస్తూ.

''ఏయ్! మంగళా! భలే ఫన్నీగా ఉంది మీ అమ్మగారి పేరు. ఇంత పెద్దయినా ఇంకా 'చిట్టితల్లీ' అని పిలుస్తూంటే మీకు చిన్న ంగా లేదా ఆంటీ!'' అంటూ జోక్స్ మీద జోక్స్ కట్ చేసి నవ్వడం ప్రారంభించారు ంగళ ఫ్రెండ్స్.

మంగళ బుర్ర అవమాన భారంతో కృంగిపో ంది.

వాళ్లందరూ వెళ్లిపోయాక అలిగి కూర్చుంది న్నం తినకుండా.

నేను సర్ది చెప్పి చూశాను. ''ఇదంత పెద్ద వి యం కాదమ్మా మంగళా! నా పేరు విని వాళ్లు నవ్వితే అది వాళ్ల సంస్కారం. పేరుల ముంది చెప్పు?'' అన్నాను అనునయంగా.

''నీకు తెలీదమ్మా! పేరులోనే ఉందంతా! ఇక రేపట్నుంచీ వాళ్లు కాలేజ్‌లో ఎంతగా టీజ్ చేస్తారో తెలుసా నీకు.'' చిన్నగా ఏ డుస్తూ అంది మంగళ.

''ఇది మరీ విడ్డూరమే అమ్మాయ్! మీ మ్మకి లేని చిన్నతనం నీకు దేనికట మధ్యలో!'' మా అత్తగారు దవడలు నొక్కుకున్నా రు.

''అసలిదంతా నీ వల్లనే! ఉన్నవారూరుకోకుండా, వాళ్లముందు నా పేరు గురించి పెద్ద పంచాయితీ లేవదీశారు!'' నా కోపాన్ని మా అత్తగారిమీదకు మళ్లిస్తూ గయ్‌మన్నాను.

''ఇప్పుడు నేనేం చేశాను మధ్యన. మీ అమ్మానాన్న నీకు పెట్టిన పేరది. ఆ పేరుతో పిలవక మరేం పేరుతో పిలవమంటావో చెప్పు. బాగుంది నీ వరస. అంతగా నువ్వు, నీ కూతురు దాన్ని నామోషీగా అనుకుంటే నీ పేరు మార్చుకో.'' ఆవిడ కూడా ఏమాత్రం తగ్గకుండా అదే స్థాయిలో చెప్పారు.

హఠాత్తుగా మంగళ ముఖం విప్పారింది ఆవిడ మాటలతో.

''వెరీగుడ్ ఐడియా బామ్మా! బాగా జ్ఞాపకం చేశావు. అమ్మా! వెంటనే నువ్వు నీ పేరు మార్చుకోవాలి'' అంది ఆనందంగా.

''ఇదేం తద్దినమే నాకు? అదంతా పెద్ద తలనొప్పితో కూడిన వ్యవహారం కదా!'' నీరసంగా అన్నాను నేను.

''అదంతా ఏం కాదులే అమ్మా! నువ్వేమీ సర్టిఫికెట్లలోంచీ నీ పేరేమీ మార్చుకోబోవటం లేదు కదా! ఈ పని చేసేది కేవలం నలుగురూ నిన్ను అపహాస్యం చేయకుండా ఉండడం కోసమే! కాబట్టి, పేపర్ నోటిఫికేషన్ ఇస్తే సరిపోతుంది. ఏమంటావు?'' ఇనుమడించిన ఉత్సాహంతో ఉరకలు వేసింది మంగళ.

ఇంక నేను కాదనేదేముంది? నిజం చెప్పొద్దూ! చిట్టితల్లి అని నలుగురితోనూ పిలిపించుకోవడం నాక్కూడా బాధగానే ఉందింత కాలం. అందుకే, మంగళ చెప్పిన దానికి తలాడించాను గంగిరెద్దులా.

దానికితోడు మా శ్రీవారి ప్రోత్సాహం కూడా తోడయ్యిందీ విషయంలో. అంతే. మంగళ నాకు మంచి పేరు వెతికే కార్యక్రమంలో పడిపోయింది. రకరకాల పుస్తకాలు శోధించి, ఎంతో ప్రయాసపడి... ఎలాగైతేనేం నాకు మంచి పేరు సెలెక్ట్ చేసింది.

''అపురూప'' అందమైన పేరు. కానీ ఈ వయసులో నేను టీనేజ్ అమ్మాయిలకు సూటయ్యేట్టున్న ఈ నామధేయాన్ని, నాదిగా మార్చుకోవడం ఎంతవరకు సమంజసం?

నా సందేహాన్ని త్రోసిపుచ్చింది మంగళ.

''నీకన్నీ వెర్రిమొర్రి డౌట్స్. ఇంకా పెద్దయితే అపురూపమ్మ అని పిలుస్తారులే. సుందరిని సుందరమ్మ అని, అరుంధతిని అరుంధతమ్మ అనీ పిలవడంలే ఇదీ అంతే! నువ్వింకేం మాట్లాడకు?'' అని నా నోరు మూయించింది మంగళ.

ఇప్పుడు అందరూ నన్ను 'అపురూప' అనే పిలుస్తున్నారు.

''అపురూపా!'' అంటూ ఆయన అపురూపంగా పిలుస్తూంటే కొత్తగా, వింతగా, సిగ్గుగా, ఇంకాస్త హాయిగా కూడా అనిపిస్తోంది నాకు.

ఆయన నోట మధురంగా ధ్వనిస్తున్న నా సరికొత్త పేరు నా చెవుల్లో అమృతం కురిపిస్తోంది.

★★★

నాలుగు నెలలు గడిచాయి.

అక్కయ్యకి మనుమడు కలిగాడని, బారసాలకి రమ్మని శుభలేఖ వచ్చింది.

మంగళకి కూడా అనుకోకుండా సెలవులు కలిసి రావడంతో అది, నేను కలిసి మా ఊరికి బయలుదేరాం.

అక్కయ్యకి పెళ్లి చేసి, మా బావగారిని ఇల్లరికపుటల్లుడుగా తెచ్చుకున్నారు అమ్మా వాళ్లు.

అక్కయ్య కూతురు శిరీషకి పెళ్లయ్యిన పదేళ్ల తరువాత సంతానం కలగడంతో ఫంక్షన్ గ్రాండ్‌గా అరేంజ్ చేశారు.

మమ్మల్ని చూసి అమ్మ, నాన్న, తాతయ్య అందరూ ఎంతగానో సంబరపడ్డారు.

మంగళ అందరికీ నేను పేరు మార్చుకున్న విషయం వెల్లడి చేసింది. అంతేకాదు.


అందరూ నన్నలాగే పిలిచి తీరాలని శాసించింది కూడా.

నామకరణ మహోత్సవం జరుగుతోంది శాస్త్రోక్తంగా.

శిరీష భర్త పిల్లాడికి ఏం పేరు పెడతాడా అని అందరూ ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

ఎన్నో పేర్లు కలిపి చివరికి 'పైడిరాజు' అని రాశాడతను.

నేనెంతగానో ఆశ్చర్యపోయాను. కొత్త మిలీనియంలోకి అడుగుపెట్టాం మనం. అందరూ హృతిక్ అనో, రోహిత్ అనో మోడ్రన్‌గా పేర్లు పెట్టుకుంటూంటే పిల్లాడికి ఇంత మోటుగా ఈ పేరు పెట్టారేంటి? ఈ కంప్యూటర్ యుగంలో కూడా ఇంత పాత పేరు పెట్టడంటే శిరీష భర్తనేమనుకోవాలో నాకర్థం కాలేదు.



మంగళయితే తన కుతూహలాన్ని ఆపుకోలేక అడిగేసింది వెంటనే.

''ఏంటి బావగారూ! ఈరోజుల్లో కూడా ఇటువంటి పేరా! రేపు వాడు పెరిగిపెద్దయితే, మీరిటువంటి పేరు వాడికి పెట్టినందుకు మీపై ఎంతగా కోపగించుకుంటాడో తెలుసా?'' అంది ఆరిందాలా.

చిన్నగా నవ్వాడు శిరీష భర్త.

''నువ్వన్నది నిజమే కావచ్చు మరదలు పిల్లా! కానీ ఎన్నో ఏళ్లుగా మాకు సంతానం కలగలేదు. ఎందరో డాక్టర్స్‌ని కన్సల్ట్ చేసినా మాలో ఏ లోపమూ లేదనే చెప్పేవారు. అప్పుడు తెలిసిన వాళ్ల సలహామీద పైడితల్లి అమ్మవారికి మొక్కుకున్నాం. వెంటనే మాకు వీడు పుట్టాడు. వీడు ఆ దేవత వరప్రసాదం అని భావించి, ఆ అమ్మవారు వీడిని ఎల్లకాలమూ చల్లగా కాపాడాలని ఈ పేరు పెట్టాం. వాడు పెద్దవాడయ్యాక ఈ పేరు మార్చుమని పట్టుబడితే ఏం చెయ్యలేం! కానీ అంతవరకూ ఆ అమ్మవారి మీద భక్తిశ్రద్ధలతో వీడిని లాగే పిలుచుకుంటాం.'' సుదీర్ఘంగా చెప్పాడు శిరీష భర్త.

ఎందుకో, అతని మాటలు నా గుండెల్లో సూటిగా నాటుకున్నాయి.

తాతయ్య ఎప్పుడూ, నా పేరు వెనకగల గాథ చెప్పడం నాకు జ్ఞప్తికొచ్చిందా క్షణం.

నేను పుట్టక ముందు, అంటే మా అక్కయ్య తరువాత అమ్మకి నలుగురు బిడ్డలు కలిగిపోయారుట. పుట్టిన వెంటనే ఇద్దరు, నామకరణాలు జరిగాక ఇద్దరు... ఇలా, కలిగిన సంతానమందరూ మట్టికొట్టుకు పోతూండడంతో అమ్మ ఎనలేని క్షోభకు గురయ్యిందట.

ఈసారయినా పుట్టినబిడ్డ దక్కితే బాగుణ్ణని ఎన్నో మొక్కులు మొక్కుకున్న తరువాత, నేను పుట్టానట.

ముందు జరిగిన విపరీతాలను దృష్టిలో పెట్టుకుని, నాకు నామకరణం చేయటం, ఉయ్యాల్లో పెట్టడం, పుట్టినరోజు వేడుకలు జరపడం లాంటి ఫార్మాలిటీస్ ఏమీ పాటించలేదని తాతయ్య అస్తమానం చెప్తూ ఉంటాడు.

ఎలాగోలా బ్రతికి బాగుంటే చాలునని అమ్మ, నాన్న అందరూ నన్ను 'చిట్టితల్లీ' అని మామూలుగా పిలిచేవారు. ఆఖరుకి అదే నా నామధేయంగా స్థిరపడిపోయింది.

అవి పాతరోజులు కాబట్టి నేనంతగా పట్టించుకోలేదు. చుట్టూతా జనం ఎవరూ వెక్కిరించలేదు.

కానీ కాలం మారింది. మనుష్యుల భావాల్లో కూడా మార్పు వచ్చింది.

ఇటువంటి పేరుతో ఈరోజుల్లో చెలామణీ అయితే అందరి అవహేళనలకీ గురవవలసి వస్తుందని అనుభవ పూర్వకంగా తెలిసింది.

అయితే, శిరీష భర్త మాటలతో క్రొంగ్రొత్త సత్యం ఒకటి ఇప్పుడే తెలుసుకున్నాను.

''కాలం మారినా, భావాలు మారినా తల్లిదండ్రుల ప్రేమలో అణువంతైనా మార్పు ఉండబోదని..''

మంచి పేర్లు పెట్టి, ఆర్భాటాలన్నీ జరిపించిన పిల్లలు మరణించడంతో వారి కడుపుతీపితో, కన్నబిడ్డలపట్ల ఎనలేని మమకారంతో నన్ను యధాలాపంగా 'చిట్టితల్లీ' అనే పేరుతో పిలిచారు నా వాళ్లు. ఏదో గాలికో, ధూళికో పెరిగితే చాలునన్న వెర్రి ఆకాంక్షలోనే నా తల్లిదండ్రులలా చేశారు.

ఇప్పుడు అదే విధంగా, కలగక కలగక కన్న సంతానం క్షేమం కోరి 'పైడిరాజు'ని పేరుపెట్టారు వీళ్లు.

రెండు సంఘటనల్లో ప్రధానాంశం కడుపుతీపి. బిడ్డక్షేమాన్ని కోరే సెంటిమెంట్. బహుశా ఏ తల్లిదండ్రులైనా ఆశించేది ఇదేనేమో...

తాముకన్న బిడ్డలు పది కాలాల పాటు పచ్చగా ఉండాలని, వారి ద్వారా తమ వంశం అభివృద్ధి చెందాలని ఆశించి, వారి విషయంలో ఇటువంటి సెంటిమెంట్లని ఏర్పరచుకుంటారన్న నిజం అవగతమైంది నాకు.

అవ్యాజమైన జననీ జనకుల అనురాగాన్ని కాలరాసే హక్కు నాకెక్కడుంది?

ఆలోచనల పరంపర నా గుండెను కోసేస్తూండగానే–

''చిట్టితల్లీ!'' అని పిలవబోతూ, పొరపాటు చేసినట్లుగా నాలుక కరుచుకుని ''అపురూపమ్మా!'' అంటూ ఏదో చెప్పబోయాడు తాతయ్య.

''వద్దు తాతయ్యా! నన్నెప్పటిలానే 'చిట్టితల్లీ' అనే పిలవండి అందరూ'' దృఢంగా అన్నాన్నేను.

''చిట్టితల్లీ!'' తాతయ్య పిలుపులో మార్దవం నాకేదో తెలియని పారవశ్యాన్ని కలుగజేసింది.

మంగళ నావైపు ఆశ్చర్యంగా చూస్తోందని తెలిసినా, నేనదేమీ పట్టించుకోలేదు.

కె.కె.భాగ్యశ్రీ